
సాక్షి
పల్నాడు
బుధవారం । 18 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్:కృష్ణా పశ్చిమ ప్రధానకాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.1584 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు కొండవీడులో వేమన జయంతి వేడుకలు

యడ్లపాడు: పల్నాడు జిల్లా కొండవీడు కొండపై వేమన జయంతి వేడుకలు గురువారం నిర్వహించనున్నారు. గుంటూరుకు చెందిన బాలభారతి స్వచ్ఛంద సంస్థ, కొండవీడు అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ వేడుకలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి, డీఎఫ్‌వో ఎన్ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉపన్యాసం అనంతరం 'యోగి వేమన పద్యరత్నాలు' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు కె శివారెడ్డి, ఎర్రం సాంబిరెడ్డి తెలిపారు.

20 వరకు రేషన్ బియ్యం

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థలోని ఎండీయూ ఆపరేటర్ల ద్వారా నిర్వహిస్తున్న రేషన్ బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ ఈనెల 20వ తేదీవరకు పొడిగించటమైందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి మాసానికి ఇంకా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారులు తమ ప్రాంతానికి పంపిణీ కోసం వచ్చే ఎండీయూ వాహన ఆపరేటర్ ద్వారా కార్డుపై బియ్యం ఉచితంగా పొందవచ్చన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్డుదారులు తమ సమీపంలో రేషన్‌డీలర్ దుకాణం నుంచి పొందాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

యార్డుకు 55,670 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,670 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 52,402 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 33,798 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 573.80 అడుగుల వద్ద ఉంది. ఇది 266.1074 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 9,443, ఎడమ కాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,694, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 26,735 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 26,735 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 847.10 అడుగుల వద్ద ఉంది.

విశ్వదాభివేమ.. కవి సార్వభౌమ

- ఆటవెలది ఈటెగా విసిరిన దిట్ట
- ఛాందస భావాలకు తొలి అడ్డుకట్ట
- రేపు అధికారికంగా వేమన జయంతి ఉత్సవాలు



పెదకాకాని మండలం వెనిగండ్లలో 1947లో ఏర్పాటుచేసిన వేమన విగ్రహం

'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాట వినని తెలుగువారు ఉండరు. వానకు తడవనివారు, ఒక వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. అంత ప్రఖ్యాతి గాంచిన మహాకవి యోగి వేమనకు సొంత రాష్ట్రంలో తగిన గౌరవం దక్కటం లేదనే భావన ఇక తొలగిపోనుంది. యోగి వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఏటా జనవరి 19న అధికారికంగా జరపనుంది. ఈ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 164 జీవోను గత నెల 30న విడుదల చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గల వేమన అభిమానులు ఆనందించే విషయమిది.

\- గుంటూరు డెస్క్

తెలుగువారికి ఎంతో సారస్వత సేవ చేసిన బ్రిటిష్ అధికారి సీపీ బ్రౌన్‌తోనే వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయి. పామరులకు కూడా అర్థమయేలా పద్యాలు చెప్పి, మెప్పించిన కవి వేమన. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు వేమన. యవ్వనంలో వేశ్యాలోలుడిగా వ్యవహరించినా, కొంతకాలానికి విరక్తి చెంది, తపస్సు చేసి యోగిగా మారారు. సమాజానికి హితబోధ చేస్తూ వేలాది పద్యాలు చెప్పారు. చివరకు కడప దగ్గరి పాముూరు కొండ గుహలో శార్వరి నామ సంవత్సరం శ్రీరామనవమి నాడు సమాధి చెందారు. కదిరి తాలూకాలోని కటారుపల్లెలోని వేమన సమాధి ప్రసిద్ధి చెందినది. వేమన జీవితకాలం 1652–1730గా పరిశోధకులు పేర్కొన్నారు.

సామాజిక చైతన్య గీతాలు ఆ పద్యాలు...

వేమన పద్యాలు లోక నీతులు. పద్యాలన్నిటినీ ఆటవెలది చంధస్సులోనే చెప్పాడు. సామాజిక చైతన్యం ఆ పద్యాల లక్షణం. సమాజంలో ఆయన స్పృశించని అంశం లేదు. అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి దర్శించి, ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట దోపిడీలను ఎలుగెత్తటమే కాకుండా విగ్రహారాధనను నిరసించారు. కుహనా గురువులు, దొంగ సన్యాసుల దోపిడీలు...ఒకటేమిటి? ప్రతి సామాజిక అస్తవ్యస్తతపైన తన కలాన్ని ఝళిపించారాయన. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు. సాధారణంగా మొదటి రెండు పాదాల్లోనూ నీతిని ప్రతిపాదించి మూడో పాదంలో దానికి తగిన సామ్యం చూపాడు.

'అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను/సజ్జనుండు పలుకు చల్లగాను/కంచుమ్రోగినట్లు కనకంబు మ్రోగునా/ విశ్వదాభిరామ వినుర వేమ' అని చాటారు. మరో పద్యంలో 'విద్యలేనివాడు విద్వాంసు చేరువ/నుండగానె పండితుండు కాడు/కొలది హంసల కడ కొక్కెరలున్నట్లు/ విశ్వదాభి రామ వినుర వేమ!'అన్నారు. కొన్ని పద్యాల్లో ముందే సామ్యం చెప్పి, తర్వాత నీతిని చెప్పాడు. అందుకు 'అనగననగరాగ మతిశయించునుండు/తినగ తినగ వేము తియ్యనుండు/ సాధనమున పనులు సమకూరు ధరలోన/విశ్వదాభిరామ వినుర వేమ' ఉదాహరణ. పద్యంలో నాలుగో పాదం 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మకుటం. విశ్వద అంటే విశ్వకార కుడికి, అభిరామ అంటే ప్రియమైన వాడని, అంటే సృష్టికర్తకు ప్రియమైన వేమా, వినుము–అని ఈ మకుటానికి అర్థం చెప్పారు పండితులు. బ్రౌను మహాశయుడు ఇదే అర్థంతో వేమన పద్యాలను ఇంగ్లిష్‌లోకి అనువదించారు.

వేమన కీర్తిని అజరామరం చేశారు...

తెలుగువారిలో వేమన కీర్తిని అజరామరం చేయటానికి కృషి చేసినవారు కట్టమంచి రామలింగారెడ్డి. రాష్ట్రంలో పలుచోట్ల వేమన జయంతి ఉత్సవాలు, సంఘాల ఏర్పాటును సాధించారు. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి వేమనను సంస్కర్తగా ప్రస్తుతించారు. ఆరుద్ర 'మన వేమన' పుస్తకాన్ని రచించారు. డాక్టర్ ఎన్.గోపి, బంగోరె వంటి కవులు, రచయితలు వేమన రచనలపై పరిశోధనలు చేశారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావుచే కేంద్ర సాహిత్య అకాడమీ వేమన జీవిత చరిత్రను రాయించి 14 భాషల్లోకి అనువదింపజేసింది. ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోకి, అన్ని ద్రావిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువాదమయ్యాయి. వేమనకు లభించిన గౌరవం మరే తెలుగు కవికీ లభించలేదు. ఐక్యరాజ్యసమితి–యునెస్కో విభాగం, ప్రపంచ భాషా కవుల్లో గొప్పవారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎన్నుకుని, ఆ రచనలను పలు భాషల్లోకి అనువదింపజేశారు. వేమన జీవిచరిత్ర, యోగి వేమన (1947), యోగి వేమన (1988), శ్రీవేమన చరిత్ర (1986) పేర్లతో సినిమాలుగా ప్రజలను ఆలరించాయి. పౌరాణిక నటుడు గుమ్మడి గోపాలకృష్ణ రూపొందించిన 'యోగి వేమన' సీరియల్ టీవీ ఛానల్‌లో ప్రసారమైంది. ఇంతటి కీర్తిని పొందిన వేమన జయంతికి పొరుగునున్న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఏటా తగిన నిధులను కేటాయిస్తూ, తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది. మైసూర్ మహారాజ సంస్థాన్ ఏనాడో వేమన ప్రాశస్త్యాన్ని గుర్తించింది. తెలుగు రాష్ట్రాల్లో వేమనకు, ఆయన సాహిత్యానికి తగిన ప్రచారం, గౌరవాన్ని కల్పించటం లేదనేది నిష్ఠురసత్యం.

వేమనను కనుగొన్న బ్రౌన్...



మోదుకూరు గ్రామంలో వేమన విగ్రహం

వేమన పద్యాలు వందల సంవత్సరాల వరకు గ్రంథస్థం కాలేదు. కేవలం సామాన్యుల నాల్కలపైనే నడయాడుతూ వచ్చాయి. 1731లో ఫాదర్ లెగాక్ తొలిసారిగా వేమన పద్యాలు సేకరించాడని పరిశోధకుల భావన. 1816లో ఒక ఫ్రెంచి మిషనరీ, తర్వాత ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌లు వేమన పద్యాలెన్నింటినో సేకరించారు. తాను వేమనను కనుగొన్నానని బ్రౌన్ సాధికారికంగా ప్రకటించుకొన్నారు.

వందలాది పద్యాలను సేకరించి వాటిని లాటిన్, ఇంగ్లిష్ భాషల్లోకి అనువదించారు. అలాగే హెన్నీ బ్లూచాంస్ (1897), విలియమ్ హోవర్డ్ కాంబెల్ (1920), జీయూ పోప్, సీఈ గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు, వేమనను లోకకవిగా కీర్తించారు.

మహాకవి పేరిట విశ్వవిద్యాలయం..

ఆ మహాకవి పేరిట దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కడప జిల్లాలో యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని నిర్మించి అనేక కోర్సులతో విద్యను అందించడంతోపాటు వేమన జీవితం మరుగున పడకుండా భావితరాలకు అందించడం గమనార్హం.

దీనిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై 1929 నుంచి వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న తెనాలి సమీపంలోని మోదుకూరు గ్రామంలోని వేమన జయంతి ఉత్సవ కమిటీ హర్షం తెలియజేసింది.

నాడే సాహసోపేత హేతువాది...

ఆ కాలం పరిస్థితుల ప్రకారం వేమనను గొప్ప హేతువాదిగా ప్రశంసించింది సాహితీలోకం. సమాజంలో ప్రబలంగా పాతుకుపోయిన ఆచారాలు, మూఢనమ్మకాలను ఆ రోజుల్లో అంత నిశితంగా ఎత్తిచూపటానికి ఎంతటి ఆత్మస్థైర్యం, అవగాహన కావాలి. విగ్రహారాధనను విమర్శిస్తూ...'పలుగు రాళ్లు దెచ్చి/ పరగ గుడులు కట్టి/ చెలగి శిలల సేవ జేయనేల?/ శిలల సేవ జేయ ఫలమేమి కలుగురా?'అని ప్రశ్నించారు. కుల విచక్షణలోని డొల్లతనం గురించి... 'మాలవానినంటి/ మరి నీట మునిగితే/ కాటికేగునపుడు కాల్చు మాల/ అప్పుడంటినంటు ఇప్పుడెందేగెనో?...' అనడిగారు.

సర్కారు విద్యాలయాలకు మహర్దశ

- సీబీఎస్ఈ బోధనకు నియోజకవర్గంలో 10 పాఠశాలలు ఎంపిక
- ఉపాధ్యాయులకు దశలవారీగా ప్రత్యేక శిక్షణ

సత్తెనపల్లి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులను అన్నింటికీ సిద్ధం చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. శాస్త్రీయ విధానంలో పాఠ్యాంశ బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యం, గ్రహించే సామర్థ్యం పెంపొందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ విధానం అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ సిలబస్ ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలు కానుంది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతి విద్యార్థులను సెంట్రల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించనున్నారు.

నియోజకవర్గంలో ఎంపికైన పాఠశాలలు

సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 10 పాఠశాలలను ఎంపిక చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి రూరల్ మండలంలో భృగుబండ, కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ముప్పాళ్ల మండలం మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజుపాలెం మండలం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, నకరికల్లు మండలం గుండ్లపల్లి, నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, దేచవరం మోడల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం.



విద్యార్థులు(ఫైల్)

ఉపాధ్యాయులకు శిక్షణ

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో పది పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం సీబీఎస్ఈ బోధన జరగనుంది. ఆ మేరకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు దశలవారీగా శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు సిలబస్ ఆధారంగా ముద్రించిన పాఠ్యాంశాలను బోధిస్తారు. ఈ విధానంలోని పరీక్షల్లో అడిగిన ప్రశ్నలకు నేరుగా జవాబులు రాస్తారు. ఎక్కువ మంది పిల్లలు బట్టీ విధానాన్ని అనుసరిస్తున్నారు. సీబీఎస్ఈలో ప్రతి అంశం ప్రయోగాత్మకంగా ఉంటుంది. సహజంగా తాము నేర్చుకున్న దాన్ని బట్టి సమాధానాలు రాస్తారు. దేశవ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షలను ఆత్మస్థైర్యంతో రాయగలరు.

పోటీ పరీక్షల్లో రాణింపు



సీబీఎస్ఈ సిలబస్‌తో రాష్ట్ర విద్యావిధానంలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయి. దేశవ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటే అవకాశం వస్తుంది. రాబోయే కాలంలో అన్ని తరగతులు సీబీఎస్ఈలోకి మార్చవచ్చు. ప్రారంభంలో ఇబ్బందులు ఎదురైనా సత్ఫలితాలు వస్తాయి. విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా పాఠశాలల్లో సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతుంది.

\- ఏ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి.

ఉన్నత పాఠశాలల్లో పోస్టుల భర్తీకి చర్యలు

- నేడు సీనియర్ ఎస్జీటీలకు కౌన్సెలింగ్
- ఉమ్మడి జిల్లా పరిధిలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన 210 మంది ఉపాధ్యాయులు

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సుపై నియమించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సజావుగా జరిగింది. గతేడాది అక్టోబర్‌లో జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో విల్లింగ్ ఇచ్చిన ఎస్జీటీలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు హైస్కూళ్లలో అవసరమైన గణితం, బయాలాజికల్ సైన్స్, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ పోస్టుల్లో పనిచేసేందుకు ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం విదితమే. మలి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన మిగిలిన 30 శాతం డీఎస్సీ కోటా ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా సబ్జెక్టులకు సంబంధించి, సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీలకు మంగళవారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 210 మంది ఎస్జీటీలు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను డీఈవోజీఎస్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచుతామని, సంబంధిత ఉపాధ్యాయులు బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు గుంటూరు డీఈవో కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో ఉర్దూ మీడియంలో స్కూల్ అసిస్టెంట్ గణితం, బయాలాజికల్‌సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పోస్టులకు బుధవారం ఉదయం 10.30 గంటలకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఏ.తిరుమలేష్, జె.రమేష్‌కుమార్, జి.శ్రీనివాసరావు, కె.విజయభాస్కర్, ఏ. రాఘవేంద్రరావు, కేవీ రామిరెడ్డి, ఎం.డానియేల్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సీనియర్ హెచ్‌ఎంలు తిరుమలేష్, రమేష్, ఉర్దూ డీఐ ఖాసిం

అండర్ పాస్ నిర్మించేందుకు
చర్యలు తీసుకోండి

నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వినతి

నాదెండ్ల: రైతుల సమస్యలను పరిష్కరించి, క్యాటిల్ అండర్‌పాస్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ కార్యాలయంలో విజయవాడ రీజనల్ అధికారి బెహ్రేకు రైతులతో కలసి వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో గణపవరం–అప్పాపురం డొంక రోడ్డులో అండర్‌పాస్ నిర్మాణం చేపట్టకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. రహదారికి పడమర వైపున వెయ్యి ఎకరాలకు పైగా పంట భూమి ఉందని వివరించారు. రైతులకు సంబంధించిన ఎడ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి తెచ్చుకోవాలన్నా ప్రస్తుతం ఉన్న ప్లాను ప్రకారం సుమారు 4 కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి ఉంటుందని వివరించారు. ఈ సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అదే విధంగా సాగునీటి కాలువలు పూడిపోవటం వలన రైతులు సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షపునీరు వెలుపలకు వెళ్లేందుకు సక్రమంగా పైపులైన్లు వేయకపోవటంతో వర్షపునీరు పంటపొలాలను ముంచెత్తే ప్రమాదం ఉందని ఆయన దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచి వి.హిమంతరావు తదితరులు పాల్గొన్నారు.



రీజనల్ అధికారి బెహ్రేకు సమస్యను వివరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

రైతుకు భరోసా.. పంటకు భద్రత

- జిల్లాలో 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు
- ఒక్కో దానికి రూ.40 లక్షలు మంజూరు
- మొత్తం రూ.11.60 కోట్లు విడుదల
- గోడౌన్ సామర్థ్యం 500 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు 11 సెంటర్ల పనులు పూర్తి
- 18 సెంటర్లలో వివిధ దశల్లో పనులు

కొరిటెపాడు(గుంటూరు): ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తు నుంచి దిగుబడి వరకు కావాల్సిన అన్ని రకాల సేవలు అందిస్తోంది. పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతు భరోసా కింద రైతు ఖాతాలకు నగదు జమ చేస్తోంది. తాజాగా రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధర వచ్చే వరకు భద్రంగా దాచుకునేందుకు వీలుగా మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్మించి రైతులకు అండగా నిలుస్తోంది. ఎలాంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా పంటలను గోడౌన్లలో భద్రపరచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలవుతుంది. ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌కు రూ.40 లక్షల పెట్టుబడితో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుందుకు వీలుగా రూ.11.60 కోట్లతో 14,500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో వాటిని నిర్మిస్తున్నారు.



అనంతవరప్పాడులో పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు

జిల్లాకు 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మంజూరు

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇందులో ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌ను రూ.40 లక్షలతో 50 సెంట్ల స్థలంలో నిర్మిస్తున్నారు. వీటిని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్మిస్తున్నారు.

ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే..

జిల్లాలోని గుండ్లపాడు, పెనుమూలి, పెదపాలెం, కాజ, వడ్డేశ్వరం, కొలకలూరు, బుర్రిపాలెం, వల్లభాపురం, దావులూరు, కొల్లిపర, వెల్లలూరు, రేటూరు, కె.బి.పాలెం, చినలింగాయపాలెం, కారంపూడిపాడు, పుసులూరు, జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరు, శిరిపురం, ఈమని, పెదరావూరు, తాళ్లపాలెం, ఉప్పరపాలెం, కసుక్రరు, నందూరు, సుద్దపల్లి, పెదకాకాని, అనంతవరప్పాడులలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లు నిర్మిస్తున్నారు. ఇందులో గుండ్లపాడు, పెదపాలెం, కాజ, కొలకలూరు, బుర్రిపాలెం, దావులూరు, కొల్లిపర, ఈమని, ఉప్పరపాలెం, పెదకాకాని, అనంతవరప్పాడులలో నిర్మించే గోడౌన్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వల్లభాపురం, వెల్లలూరు, పుసులూరు, శిరిపురం, తాళ్లపాలెం, కసుమర్రు, సుద్దపల్లిలలో నిర్మించే గోడౌన్ల పనులు బేస్‌మట్టం దశలో ఉన్నాయి. జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరులలో నిర్మించే గోడౌన్ల పనులు ప్లాస్టింగ్ దశలో ఉన్నాయి. మిగతా గోడౌన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఏదిఏమైనా మార్చి మాసం చివరికంతా పనులను పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయి.

ఏయే వసతులుంటాయంటే...

ఈ మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లలో రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకొనేందుకు వీలుగా ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తారు. రైతు పండించిన పంట ఉత్పత్తులను తెచ్చి అమ్ముకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ఉంటాయి. అలా కాకుండా పంటలను అమ్ముకోని వారు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ సెంటర్‌లలో భద్రపరచుకోవచ్చు. ఇలా అన్ని రకాల వసతులతో వీటిని నిర్మిస్తున్నారు.

శరవేగంగా పనులు

మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో 11 గోడౌన్‌ల పనులు పూర్తి కాగా, మిగతావి బేస్‌మట్టం స్థాయితోపాటు ప్లాస్టింగ్ దశకు వచ్చాయి. సంబంధిత పనులన్నింటిని త్వరితగతిన మార్చి మాసం చివరి నాటికి పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. పనులు పూర్తయిన వెంటనే వాటిని సహకార సంఘాలకు అప్పగించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తారు.

–ఐ.నారాయణ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ).

మిరప పంటను పరిశీలించిన ఇంగ్లాండ్ బృందం

ఫిరంగిపురం: 113 తాళ్లూరు గ్రామంలోని మేరువ లక్ష్మారెడ్డి మిరప పంట పొలాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఇంగ్లాండ్ దేశానికి చెందిన రెయిన్ ఫారెస్ట్ బృందం సభ్యులు పరిశీలించారు. మిర్చిలో ఉల్లి, పసుపు, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మినుమును అంతర పంటలుగా, సరిహద్దు పంటలుగా జొన్న, సజ్జ, ఎర పంటలుగా బంతి, ఆముదం సాగు చేస్తున్నట్లు డీపీఎం రాజకుమారి వారికి వివరించారు. దానికి సంబంధించి పూర్తి వివరాలను టీం సభ్యులు వీడియోలో రికార్డు చేశారు. ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకునే విధానం గురించి రైతులతో చేయించి చూపించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ ఇన్‌చార్జి మల్లేశ్వరి, ఎంటీ వీరలక్ష్మి, ఏడీఏ అన్నామణి, ఐసీఆర్పీ ఇ.వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, ప్రభావతి, గాయత్రి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు - తిరుపతి

ఆర్.ఓ.సి.నెం. 47022(32)/15/2021 రెవెన్యూ తేది 11.01.2023

"టెండరు-సహిత-వేలం పాట నోటీసు"

పల్నాడు జిల్లా, దుగ్గిరాల మండలము, చిలుపూరు గ్రామము నందలి తిరుమల తిరుపతి దేవస్థానమునకు చెందిన సర్వే నం. 63-1 నందలి ఎ.2.37½ సెంట్లు విస్తీర్ణం కలిగిన భూమును జనవరి 2023- డిసెంబర్ - 2023 సంవత్సరమునకు కౌలు/లీజుకై ఇవ్వడానికి తిరుమల తిరుపతి దేవస్థానముల సంయుక్త కార్యనిర్వహణాధికారి గారు నిర్ణయించారు. సదరు భూముల కౌలు నందు ఆసక్తియున్న వారి నుంచి సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ సహిత వేలం గ్రామ పంచాయతీ కార్యాలయము, చిలుపూరు నందు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	గ్రామము మరియు మండలం పేరు	భూమి వివరములు	సర్వే నెం.	భూ విస్తీర్ణము ఎక. సెంట్లు	నిర్ణయించిన ఇ.ఎం.డి ధరావత్తు మొత్తము
1.	చిలుపూరు	వ్యవసాయ భూమి (యధాతథంగా)	63-1ఎ	2.37½	5000.00

టెండరు ఫారములు (దరఖాస్తు) కావలసినవారు రూ.200/- (అక్షరాల రూపాయలు రెండు వందలు మాత్రమే) మరియు జి.ఎస్.టి.18% కలిపి మొత్తము రూ.236/- తిరుపతిలో చెల్లుబాటు అయ్యేవిధంగా కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి వారి పేరున తీసిన డిమాండు డ్రాఫ్టు సమర్పించి సహాయ కార్యనిర్వహణాధికారి (రెవెన్యూ), తిరుమల తిరుపతి దేవస్థానముల పరిపాలనా భవనము, తిరుపతి వద్ద నుంచి లేదా వేలం ప్రారంభించేముందు **తేది. 24.01.2023 ఉదయం 11.00 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం, చిలుపూరు** వద్ద పొందవచ్చును. నింపబడిన/పూరించిన సీల్డు టెండరు ఫారములు వేలం ప్రారంభించేముందు **తేది. 24.01.2023 ఉదయం 11.30 గం॥లు** వరకు స్వీకరించబడును.

తిరుమల తిరుపతి దేవస్థానము వారు నిర్ణయించిన ప్రకారం ఇ.ఎం.డి. కొరకు డిడిలను జతపరచకుండా సమర్పించిన/టాల్లు చేసిన దరఖాస్తులు నిర్ణీత దినము, సమయము దాటిన తరువాత సమర్పించిన / అందిన టెండరు దరఖాస్తులు / తిరుమల తిరుపతి దేవస్థానములు నిర్ణేశించిన నియమ నిబంధనలు పాటించకుండా సమర్పించిన దరఖాస్తులు తిరస్కరించబడును.

ఎట్టి కారణములు చూపకుండా ఏ స్థాయిలోనైనా/సందర్భములోనైనా ఈ బహిరంగ వేలమును ఆమోదించుటకు గాని / తిరస్కరించుటకుగాని / వాయిదా వేయుటకు గానీ తిరుమల తిరుపతి దేవస్థానముల యాజమాన్యమునకు సంపూర్ణ అధికారము కలదు.

ROC No. PR4/13950/ADV No.353/PRO/2023 Date: 17.01.2023 కార్యనిర్వహణాధికారి

కనుల పండువగా సంక్రాంతి సంబరాలు


మిమిక్రీ కళాకారుడు శివారెడ్డితో కలిసి స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

- సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డితో మిమిక్రీ ప్రదర్శన
- ఆకట్టుకున్న రాజసింహ, సుమంత్, ఆనంద్ పాటలు
- స్టెప్పులేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఆహ్లాదకరమైన సాయం సంధ్య వేళలో పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియం ఆవరణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కనుల పండువగా సాగాయి. చివరి రోజున సోమవారం నిర్వహించిన వేడుకలు రాత్రి పొద్దుపోయేంతవరకు నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్, ఆయన కుటుంబ సభ్యులు, శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం హాజరయ్యారు. గాలిపటాలు ఎగురవేసి జిల్లా అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మిమిక్రీ ఆర్టిస్టు, సినీనటుడు శివారెడ్డి మిమిక్రీ, జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి కామెడీ, గాయకుడు సింహ పాటలు, సుమంత్, సునంద తమ గానాలతో అలరించారు. కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాటలకు అనుగుణంగా స్టెప్పులేసి సభికులను ఉత్సాహపరిచారు. ప్రదర్శనకు వచ్చిన కళాకారులతో పాటు వేడుకల నిర్వహణకు కృషి చేసిన జిల్లా అధికారులు డి.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్,, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సత్కరించారు. పెద్ద ఎత్తున జనం కుటుంబ సభ్యులతో తరలిరావడంతో స్టేడియం మొత్తం నిండిపోయింది.

■ ఆత్మీయ కలయిక


తాడేపల్లిలోని క్యాంపు ఆఫీసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి - సాక్షి ఫొటోగ్రాఫర్

జనం బాగుంటే బాబు అండ్ కోకు నచ్చడం లేదు

- మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పరిపాలన అందిస్తుంటే టీడీపీ నాయకులకు మింగుడు పడటం లేదని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో పండుగ చేసుకుంటే చంద్రబాబు, అండ్‌కోకు మాత్రం కోడి పందేలపై పడ్డారన్నారు. గతంలో టీడీపీ నాయకులు కోడి పందేలు నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. సంక్రాంతి వేళ పాడి పంటలు, గిట్టుబాటు ధరలతో రైతులు సంతోషంగా ఉంటే టీడీపీ నేతలు మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. మిర్చి, ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, ఎక్కడా దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మిర్చి రైతులకు ఇచ్చిన పరిహారాన్ని కూడా కాజేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప గతంలో జీవీ చేసిన మంచి పనులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. నియోజకవర్గంలో అన్నీ గ్రామాల్లో సంక్రాంతి పండుగ ఆట పాటలతో ఆనందంగా జరుపుకుంటుంటే ముగ్గుల పోటీలు అడ్డుకున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామాల్లో ఏదో ఒక విధంగా ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం చిల్లర రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకే చెల్లుతుందన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో కోట్లాది నిధులతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లతో పాటు నాడు-నేడు నిధులతో పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. టీడీపీ నాయకులు కళ్లు ఉండి కూడా అభివృద్ధిని చూడలేని గుడ్డివాళ్లుగా మారారని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చంద్రబాబు పంచనే బాగుంటుందని తోడు దొంగల్లా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఒంటరిగా పోటీ చేసి గెలువలేని చంద్రబాబు, పవన్ రాష్ట్రంలో అన్నీ పార్టీలను కలుపుకుని వచ్చినా మేము ఒంటరిగా పోటీ చేసి 175 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మళ్లీ విజయం తమదేనన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, బొల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నరసరావుపేట: బరంపేటలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 2023-24కు సంబంధించి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తుందన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు.

వందశాతం ఈకేవైసీ పూర్తిచేయండి


– జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలోని 37 గ్రామాల్లో జగనన్న భూ హక్కు పత్రాలకు సంబంధించి ఇప్పటికి 74 శాతం ఈ-కేవైసీ పూర్తయిందని, మరో మూడు నాలుగు రోజుల వ్యవధిలో వందశాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్ నుంచి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై సమీక్షిస్తూ 27 గ్రామాల్లో మ్యుటేషన్లకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ పంపిణీకి సంబంధించి అసైన్డ్ ల్యాండ్ల గుర్తింపు, జనవరి-2023 నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన శ్మశానవాటికల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పనుల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ వసంత కుమార్, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్ల కేటాయింపు

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు మంగళవారం వెల్లడించారు. రైలు నంబర్ 07153 నరసాపూర్-యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ ఉంటుందన్నారు. ఈ రైలు మధ్యాహ్నం 3.10 గంటలకు నరసాపూర్ స్టేషన్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 7.50 గంటలకు గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి మరుసటి రోజు ఉదయం 10.50 గంటలకు యశ్వంత్‌పూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబర్ 07514 ప్రత్యేక రైలును (యశ్వంత్‌పూర్-నరసాపూర్) ఈ నెల 19న కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ రైలు యశ్వంత్‌పూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి శుక్రవారం తెల్లవారుజాము 3.35 గంటలకు గుంటూరు స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఉదయం 8.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07156 యశ్వంత్‌పూర్-నరసాపూర్ రైలు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు నరసాపూర్ స్టేషన్ నుంచి బయలుదేరి అదేరోజు సాయంత్రం 6.25 గంటలకు గుంటూరు స్టేషన్‌కు చేరుకుని, అక్కడ నుంచి శనివారం ఉదయం 10.30 గంటలకు యశ్వంత్‌పూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. 07517 యశ్వంత్‌పూర్-నరసాపూర్ రైలు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5.20 గంటలకు యశ్వంతపూర్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5.30 గంటలకు గుంటూరు స్టేషన్‌కు చేరుకుని అక్కడ నుంచి అదే రోజు ఉదయం 10.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. 07046 సికింద్రాబాద్-దిబ్రూగ్రహ్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ఫిబ్రవరి 2, 9, 16, 23వ తేదీల్లో ప్రత్యేక రైలును కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రైలు ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడ నుంచి బయలుదేరి శనివారం రాత్రి 8.50 గంటలకు దిబ్రూగ్రహ్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07047 ప్రత్యేక రైలును ఫిబ్రవరి 5, 12, 19, 26వ తేదీల్లో కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ రైలు ఆదివారం రాత్రి 7.25 గంటలకు దిబ్రూగ్రహ్ స్టేషన్ నుంచి బయలుదేరి గుంటూరు రైల్వే స్టేషన్‌కు మంగళవారం రాత్రి 10.10 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

జేసీఎస్ కన్వీనర్లు వారధుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి

పట్నంబజారు(గుంటూరు): రాష్ట్ర రాజకీయ చరిత్రలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి విప్లవాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు, గృహ సారధులు, ప్రజలకు మధ్య జేసీఎస్ మండల కన్వీనర్లు వారధుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కృష్ణనగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ కార్యాలయంలో మంగళవారం గుంటూరు జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్ (జేసీఎస్) సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్, పొన్నూరు, గుంటూరు తూర్పు, మంగళగిరి నియోజకవర్గాల పరిశీలకులు పూనూరి గౌతమ్‌రెడ్డి, అడపా శేషు, నిమ్మకాయల నారాయణతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు, నూతనంగా నియమితులైన జేసీఎస్ కన్వీనర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీఎస్ కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారధులతో కలిసి సమన్వయంగా జేసీఎస్ మండల కన్వీనర్లు ముందుకు సాగాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు వారికి కేటాయించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అంశంలో జగనన్న సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారధులతో సమాచారాన్ని అందిపుచ్చుకుంటూ పార్టీ ఆదేశాలను స్పష్టంగా పర్యవేక్షించాలని చెప్పారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గడప ముంగిటకు చేర్చుతున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఒక సమర్థుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తే ఎలా ఉంటుందో చాటి చెప్పటంతో పాటు భవిష్యత్తు తరాలకు బంగారు బాట పరిచేలా సీఎం జగన్ పరిపాలన సాగుతోందన్నారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ప్రజల దరి చేరుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాటుడుతున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకునే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రతి రోజు స్పందన నిర్వహించాలి

పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: బరంపేట చాకిరాలమిట్టలోని 32, 33, 34 సచివాలయాలు, రావిపాడు-1 సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తడి-చెత్త, పొడి-చెత్త వేరు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించి పరిశుభ్రతను పెంపొందించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. చాకిరాల మిట్ట సచివాలయ పరిధిలో ఒకరికి డెంగీ ఫీవర్ రావడం గుర్తించి ఆ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ ఫీవర్ ప్రబలకుండా శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. నరసరావుపేట అర్బన్ ప్రాంతంలోని సచివాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాలను నివారించాలని ఇంటి ప్లాన్ అప్రూవల్ విధిగా ఉండేలా చూడాలన్నారు. అక్రమ నిర్మాణాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఆర్‌వీ రమణ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పద్యకవి, సాహితీవేత్త షేక్ అలీ మృతి


షేక్ ఆలీ(ఫైల్)

చిలకలూరిపేట: ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి ముస్లిం తెలుగు పద్య కవి, తొలి తెలుగు ఉపాధ్యాయుడు షేక్ అలీ(88) వృద్ధాప్య సమస్యలతో మంగళవారం ఆయన స్వగ్రామమైన లింగంగుంట్లలో కన్నుమూశారు. లింగంగుంట్లలో షేక్ ఖాసింసాహెబ్, మస్తాన్‌బి దంపతులకు 1935లో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం చిలకలూరిపేటలో చేశారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి 1954 నుంచి 1963 వరకు బొప్పుడి జెడ్పీ హైస్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఉద్యోగోన్నతి పొంది 1964 నుంచి 1973 వరకు యద్దనపూడి జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు పండిత్‌గా పనిచేస్తూ, తెలుగులో ఎంఏ, బీయిడీ పూర్తి చేశారు. 1973 నుంచి కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా, ఆ తదుపరి పదోన్నతిపై కొండేపి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ 1983లో రిటైర్డ్ అయ్యారు. రాష్ట్రంలో తెలుగు భాషలో కావ్యాలు రాసిన వారు అరుదుగా ఉన్న కాలంలోనే 1957లో మానస ప్రబోధం అనే పద్య కావ్యాన్ని రచించారు. గురుదక్షిణ, కోగంటి వారి సాహితీ సేవ, గురునిమాట, విధి విలాసం, వ్యాసమంజరి, ఆకాశవాణి, శిలువధారి, శ్రీవాసవీకన్యక, ఇందిరాభారతం వంటి ఎన్నో పద్యకవితలు రాశారు. ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందారు. అనేక సన్మానాలు, అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుగుభాషాభిమానులు, విమర్శకులు ఆయనపై పేర్కొన్న అభిప్రాయాలతో శతక సౌరభాలు- కావ్యకాంతులు అన్న గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో ప్రముఖ కవి నాగభైరవ కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు వంటి 100 మంది పైచిలుకు అభిప్రాయాలు ఆలీ సంపూర్ణ సాహితీ వికాసాన్ని ప్రతిబింబించాయి. ఆయన మృతికి పలువురు సాహితీ వేత్తలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల విజేత హరియాణా


గెలుపొందిన జట్టుకు బహుతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

ఈపూరు: జాతీయ స్థాయిలో ముప్పాళ్ల గ్రామం నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు రాష్ట్రానికే గర్వకారణమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈపోటీల్లో హరియాణా జట్టు విజేతగా నిలచింది. రన్నరప్‌గా ఇండియన్ ఆర్మీ జట్టు ద్వితీయ స్థానం కైవశం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే బొల్లాముఖ్య అతిథిగా పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలల్లో ఇలాంటి క్రీడలు ప్రోత్సహించడంపై నిర్వాహకులను అభినందించారు. గత 31 ఏళ్లుగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. వినుకొండ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వినుకొండలో స్టేడియం నిర్మాణం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటిసి తుర్లపాటి చౌడయ్య, మండలపార్టీ అధ్యక్షులు కోపెలదేవరాజ్, సర్పంచ్ రమ్య, సొసైటీ చైర్మన్ బొల్లాబుజ్జి, ముఖ్యఅతిథి బహుమతి ప్రదాత బొల్లారమేష్, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, శాఖమూరి బుచ్చయ్య, సల్లపనేని రామారావు, అనీల్, మరియబబాబు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11, 12 తేదీల్లో బాలోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో జిల్లా స్థాయి బాలోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గుంటూరు జిల్లా బాలోత్సవం-పిల్లల పండుగ-2023 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ బాలోత్సవంలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవ్ కన్వీనర్ ఎం.బోసుబాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు బానిసలుగా మారిపోతున్న పిల్లలకు సంప్రదాయ ఆటలు, క్రీడలు, సాంస్కృతిక అంశాలపై దృష్టి సారించే విధంగా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ 23 రకాల అంశాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో 4, 5, 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8, 9, 10 తరగతులకు సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఆహ్వాన కమిటీకి విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.